చీటీ పేరిట కుచ్చుటోపీ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

చీటీ పేరుతో టెక్కలి మేజర్ పరిధిలోని రోటరీ నగర్ చెందిన ఎం.సబితాదేవి ఖాతాదారులకు కుచ్చుటోపీ పెట్టింది. సుమారు రూ.రెండు కోట్లతో ఆమె పరారైనట్లు బాధితులు చెప్తున్నారు. సబితాదేవి కొన్నేళ్లుగా చీటీ నిర్వహిస్తోంది. డబ్బులు సకాలంలో ఇవ్వడంతో ఆమెకు చీటీ కట్టే వారి సంఖ్య పెరిగింది. చీటీ పేరిట సేకరించిన డబ్బులతో ఆమె పరారైంది. అవసరాలకు పనికొస్తుందని కష్టపడి కూడబెట్టిన సొమ్ముతో ఉడాయించడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సబితాదేవి డబ్బులతో ఉడాయించిందని తెలుసుకున్న బాధితులు కొందరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే బాధితులు ఎంతమంది, ఎంత మొత్తం అన్నది తెలియాల్సి ఉంది. బాధితులు మాత్రం సుమారు రూ.రెండు కోట్లు ఉంటుందని చెప్తున్నారు.

చాప కింద నీరులా మహమ్మారి

- క్షణికానందంతో కుటుంబం చిన్నాభిన్నం
- హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై ముందుజాగ్రత్తలు తప్పనిసరి
- సురక్షిత చర్యలతోనే దూరం
- చైతన్యంతో జిల్లాలో తగ్గిన వ్యాధి తీవ్రత
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

జిల్లాలో ఎయిడ్స్ మహమ్మారి చాప కింద నీరులా విస్తరిస్తోంది. ఈ వ్యాధితో ప్రతి నెలా కేసులు నమోదవుతూనే ఉన్నాయి. జిలాల్లో ఎయిడ్స్ నిరోధానికి చర్యలు తీసుకుంటున్నా వ్యాప్తి ఆగడం లేదు. వ్యాధిపై గతంలో మాదిరి అంత చర్చ లేకపోవడం పెద్దగా లేనట్లుగా కనపడుతున్నా కేసులు నమోదువుతూనే ఉన్నాయి. జిల్లాలో ప్రతి నెలా పదుల సంఖ్యలో హెచ్‌ఐవి పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అయితే ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. అనధికారికంగా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఐదేళ్ల కాలంలో 5,65,118 లక్షల మందికి హెచ్‌ఐవి అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు. వారిలో 37,860 హెచ్‌ఐవి బారిన పడినట్లు గుర్తించారు. జిల్లాలో ఐదు మండలాలను హై రిస్క్ సెంటర్లుగా గుర్తించారు. సేకరించిన రక్త నమూనాలు, పాజిటివిటీ రేటు ఆధారంగా వైరస్ వ్యాప్తి ఎక్కువ ఉన్నట్లు తేల్చారు. శ్రీకాకుళం ప్రాంతంలో ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా నెలకు నమోదవుతున్న సరాసరి 40 కేసుల్లో సగం ఒక్క శ్రీకాకుళంలోనే కావడం గమనార్హం. శ్రీకాకుళంతో పాటు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రణస్థలం, ఎచ్చెర్ల, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లోనూ కేసులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి పరీక్షలు చేస్తున్నారు. శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రి, టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రిలో ఎఆర్‌టి సెంటర్లు ఉన్నాయి. వీటితోపాటు ఈ ఏడాది అక్టోబరులో జెమ్స్ ఆస్పత్రికి ఎఆర్‌టి సెంటర్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో వ్యాధిగ్రస్తులకు అవసరమైన చికిత్స, మందులను అందిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రులతో పాటు 104, 108 వాహనాల్లో ఉచితంగా హెచ్‌ఐవి పరీక్షలు చేస్తున్నారు

పదేళ్లుగా నమోదైన హెచ్‌ఐవి కేసుల వివరాలు

సంవత్సరం	చేసిన పరీక్షలు	బాధితులు
2014-15	1,00,348	1110
2015-16	1,11,737	1012
2016-17	1,21,714	954
2017-18	1,32,997	800
2018-19	1,07,986	691
2019-20	1,36,259	527
2020-21	69,012	307
2021-22	1,22,856	423
2022-23	80,587	304
2023-24	90,724	396
(నవంబరు వరకు)		

నిర్లక్ష్యమే అసలు కారణం

ఒకప్పుడు సెక్స్‌వర్కర్లు, స్వలింగ సంపర్కులు, లారీ డ్రైవర్లలో బాధితులు ఎక్కువ మంది ఉండేవారు. వీరే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల చాలావరకు పాజిటివ్ కేసుల నమోదు తగ్గింది. కొన్నేళ్లుగా బాధితుల్లో కొత్త వర్గాలు చేరుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం వివాహేతర సంబంధాలు. తెలిసిన వారేనన్న ఉద్దేశంతో ఎటువంటి రక్షణ పరికరాలు వాడకపోవడంతో బాధితులుగా మారుతున్నారు. ఇలాంటి కేసులు ఇప్పుడు కొత్తగా నమోదవుతున్నాయి.



ఎయిడ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు

జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. వ్యాప్తిని అరికట్టేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. వ్యాధిగ్రస్తులకు ఎఆర్‌టి సెంటర్లల్లో చికిత్స అందిస్తున్నాం. ముఖ్యంగా గర్భిణుల్లో హెచ్‌ఐవి ఉంటే, బిడ్డకు సోకుండా ఉండేందుకు సకాలంలో మందులు అందిస్తున్నాం. దీనివల్ల పిల్లల్ని ఆ ముప్పు నుంచి తప్పించవచ్చు. జిల్లాలో మందులకు కొరత లేదు. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపడుతున్నాం. ముఖ్య కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశాం.

- డాక్టర్ అనురాధ
లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టిబి కంట్రోల్ అధికారి

నేడు అవగాహనా ర్యాలీ

ఎయిడ్స్ దినం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యాన శుక్రవారం ర్యాలీ నిర్వహించనున్నారు. శ్రీకాకుళం నగరంలోని డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ప్రదర్శన చేపట్టనున్నారు. అనంతరం బాపూజీ కళామందిర్‌లో సభ నిర్వహించనున్నారు.

హెచ్‌ఐవి ఇలా వ్యాపిస్తుంది

హెచ్‌ఐవి 90శాతం వరకు సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్లే వస్తుంది. హెచ్‌ఐవి బాధితులకు వాడిన ఇంజెక్షన్లు మళ్లీ ఇతరులకు వాడడం, ఒకరికి వాడిన బ్లేడ్‌లను తిరిగి వినియోగించడం వల్ల హెచ్‌ఐవి వస్తుంది. మాదకద్రవ్యాలు తీసుకునే సమయంలో ఒకే సిరంజీ, సూదిని ఎక్కువ మంది వినియోగించడం వల్ల వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. రక్తమార్పిడి సమయంలో జాగ్రత్తలు తీసుకోకుంటే వ్యాధి సోకుతుంది. గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు ప్రమాదం ఉంది. పచ్చబొట్లు, ముక్కు, చెవులు కట్టించుకునేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతరులు వాడిన బ్లేడు, టూత్‌బ్రష్‌ల వంటి వాటిని తిరిగి వినియోగించడం వల్ల వ్యాధి వస్తుంది.

ఇలా సోకదు

హెచ్‌ఐవి సోకిన వారితో కరచాలనం, ఆహారం తినే పాత్రలను మరొకరు వాడడం వంటి ద్వారా హెచ్‌ఐవి వ్యాపించదు. ఒకే బస్సులో ప్రయాణించినా హెచ్‌ఐవి సోకదు. దోమకాటు, హస్త ప్రయోగం, సామూహిక మరుగుదొడ్లు, ఈత కొలనులు, సామూహిక స్నానాల వల్ల హెచ్‌ఐవి సోకదు. హెచ్‌ఐవి సోకిన వారితో పాటు అదే ఇంటిలో నివసించడం, వారికి ఆహారం తినిపించడం వంటి వాటి ద్వారా వ్యాధి వ్యాపించదు.

కార్పొరేట్లకు ప్రభుత్వాలు దాసోహం

మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ


గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న శర్మ తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కార్పొరేట్లకు ప్రభుత్వాలు దాసోహమయ్యాయని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ విమర్శించారు. నగరంలోని స్థానిక కేంద్ర గ్రంథాలయంలో పలు సాహితీ, రచయితల సంఘాల ఆధ్వర్యాన నిర్వహించిన మహా కవి గురజాడ అప్పారావు 108వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తమాన స్థితి, గురజాడ తాత్విక దృష్టి అనే అంశంపై ఆయన మాట్లాడారు. గురజాడ సాహిత్యాన్ని అందరూ చదవాలని కోరారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సనాతన ధర్మంలో ధర్మం లేదని, మతతత్వ పోకడలే ఉన్నాయన్నారు. కళింగాంధ్ర చరిత్ర, అవశేష కర్తవ్యంపై అభ్యుదయ రచయిత సంఘం అధ్యక్షులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ కళింగాంధ్రలో గురజాడ, గిడుగు తెలుగు భాషకు, సాహిత్యానికి మంచి కృషి చేశారని చెప్పారు.

జనసాహితీ ప్రతినిధి పి.ఎస్ నాగరాజు మతం, గురజాడ ధృక్కోణంపై మాట్లాడుతూ అశాస్త్రీయ పద్ధతులకు యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ మహిళల ఆర్థిక వృద్ధి, స్వావలంబనకు గురజాడ ఎంతో పరితపించారని చెప్పారు. గురజాడ ఆధ్యయన వేదిక కన్వీనర్ పత్తి సుమతి మహిళా సాధికారితపై మాట్లాడారు. తెలుగు రచయితల వేదిక ప్రధాన కార్యాదర్శి ఆర్.వి రమణమూర్తి మాట్లాడుతూ గురజాడ యువ సాహితీవేత్తలకు మార్గం చూపించారని తెలిపారు.

కవితా నిలయం అధ్యక్షులు ఈ.వేమన మాట్లాడుతూ గురజాడ తెలుగు భాషాభివృద్ధికి అడుగుజాడ అని అన్నారు. శ్రీకాకుళం సాహితీ, జనసాహితీ, తెలుగు రచయితల వేదిక, అభ్యుదయ రచయితల సంఘం, కవితా నిలయం, గురజాడ అధ్యయన వేదిక, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సాహితీ చైతన్య కిరణాల అధ్యక్షులు ఉమాకవి, జామి భీమశంకర్, వి.జి.కె మూర్తి, యు.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంలో గురజాడకు ప్రత్యేక స్థానం

శ్రీకాకుళం అర్బన్ : తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీవేత్త గురజాడ అప్పారావు అని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజా అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రముఖ తెలుగు రచయిత గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ఎంతగానో కృషి చేశారన్నారు. 19వ శతాబ్దంలో, 20వ శతాబ్ది మొదటి దశకంలో అతను చేసిన రచనలు నేటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారని గుర్తు చేశారు. ప్రజలను జాగృతపరిచే రచనల్లో కన్యాశుల్కం నాటకం సాహితీ లోకంలో ఒక ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుందని గుర్తుచేశారు. ఈ నాటకంలో అతను సృష్టించిన గిరీశం, మధురవాణి, రామప్ప పంతులు తదితర పాత్రలు ప్రఖ్యాతి పొందాయన్నారు. ఆయన రచనలు ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్ శంకరరావు, కె.చిరంజీవులు, ప్రత్యూష, పి.మురళీకృష్ణ, పి.భానుమతి, పి.రామ్మోహన్, యు.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని పిఎస్‌ఎన్‌ఎం పాఠశాలలో గురజాడ రచించిన దేశమును ప్రేమించుమన్నా దేశభక్తి గీతాన్ని, రాజ్యాంగ ప్రవేశికని విద్యార్థులతో చదివి వినిపించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.భాస్కరరావు, పాఠశాల ఇన్‌ఛార్జి శంకరరావు, ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీదేవి పాణిగ్రహి, ఎం.లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని పెద్దతామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన గురజాడ వర్ధంతి కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలక శంకరరావు, వి.కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.


అగ్నికి ఆహుతైన వరి పొలం

రెక్కల కష్టం బుగ్గిపాలు

- పెద్ద బొడ్డపాడులో అగ్ని ప్రమాదం
- ఎకరా వరి, 25 ఎకరాల్లో వరిగడ్డి దగ్ధం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఆరుగాలం కష్టించి పండించిన పంట ఫలసాయం ఒక్క క్షణంలోనే అగ్నికి ఆహుతైంది. సకాలంలో వర్షాల్లేక ఇంజిన్లు పెట్టి సాగు చేసినా ఫలసాయం పొందే సమయంలో సంభవించిన అగ్ని ప్రమాదం అన్నదాతలను తేరుకోలేకుండా చేస్తుంది. పండించిన పంట, పశువుల మేత కోసం ఉంచిన గడ్డి కళ్లెదుటే అగ్నికి ఆహుతి కావడంతో ఆ రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. మండలంలోని పెద్దబొడ్డపాడులో అగ్ని ప్రమాదంలో ఎకరా మేర పొలాల్లోని వరి చేను, ఓవులు, 25 ఎకరాల్లో వరి గడ్డి దగ్ధమైంది. గ్రామానికి చెందిన జీలుగు చెరువులో ఉపాధి పనులు చేపడుతున్నారు. చెరువులోని ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తీసి పోగుగా వేసి వాటికి మంట పెట్టారు. గాలికి నిప్పురవ్వలు పరిసరాల్లోని పంట పొలాల్లోని కోసిన గడ్డిపై పడడంతో మంటలు వ్యాపించాయి. దీంతో పొలాల్లో ఉన్న రైతులు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో దుంపల గంగారాం, కొండల బలుసుకు చెందిన ఎకరా వరి చేను కాలిపోయాయి. బమ్మిడి భాస్కరరావు, దుంపల ముఖలింగం, తమ్మినాన తాతయ్య, తమ్మినాన రంగారావు, దుంపల రామయ్య, ఉప్పాడ సింహాచలం, ఉప్పాడ ధర్మారావు, దుంపల ప్రకాశరావు, జగదీష్ తదితర రైతులకు చెందిన సుమారు 25 ఎకరాల్లో వరి గడ్డి బూడిదైంది. కాశీబుగ్గ అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటల్లో బమ్మిడి భాస్కరరావుకు చెందిన ఆయిల్ ఇంజిన్ సెక్షన్ పైప్ కాలి బూడిదైంది. వంశధార నీరు శివారు భూములకు రాకపోయినా బెండిగెడ్డలో ఆయిల్ ఇంజిన్లకు పైపులు అమర్చి రైతులు పంటకు నీటితడులు అందించారు. బెండిగెడ్డలోని సముద్రపు పోటు ఉప్పునీరు పెడితే పొలం సారం దెబ్బతింటుందని వ్యవసాయాధికారులు హెచ్చరించినా, కళ్లెదురుగా పంటను వదిలేయలేక సాగుచేశారు. ఇన్ని కష్టాలు పడి చివరికి ఫలసాయం చేతికందివచ్చిన సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో బాధిత రైతులు రోదిస్తున్నారు. సుమారు రూ.మూడు లక్షల వరకు నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ప్రజాశక్తి - పొందూరు

మండల కేంద్రంలోని 196 సర్వే నంబరు చెరువుగర్భంలో స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా చేపట్టిన ప్రహరీ నిర్మాణాన్ని రెవెన్యూ, పంచాయతీ అధికారులు గురువారం కూల్చివేశారు. చెరువు గర్భంలో అక్రమ నిర్మాణాలపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో, దాన్ని కూల్చివేయాలని కలెక్టర్ తహశీల్దార్ వై.వి ప్రసాద్‌ను ఆదేశించారు. పోలీసుల సహకారంతో అక్రమ నిర్మాణదారులకు నోటీసులు అందించి గోడను జెసిబితో కూల్చివేశారు. ఇదే సర్వే నంబరులో మరో నిర్మాణాన్ని నిలుపుదల చేసి శ్లాబ్ సెంట్రింగ్ మెటీరియల్‌ను తొలగించారు. గతంలో ఆక్రమిత స్థలంలో ఇదే ఆక్రమణదారుడు ప్రహరీని నిర్మించాడు. కలెక్టర్ ఆదేశాలతో అప్పటి తహశీల్దార్ రాంబాబు గోడను కూల్చివేశారు. మళ్లీ ఇప్పుడు నిర్మాణం చేపట్టగా అధికారులు కూల్చివేశారు. కూల్చివేత ప్రక్రియలో సిఐ వైదయ్య, ఎస్‌ఐ లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్, విఆర్‌ఒలు, సర్వేయరు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న కళ్యాణి

ప్రజాశక్తి - కొత్తూరు

వేతన పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల ఎనిమిదో తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ, ఎస్.ధనలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో అంగన్వాడీలతో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు పిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నా, వేతనాలు మాత్రం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ వేతనం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి హామీ నెర్చవేర్చలేదని విమర్శించారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని గతేడాది సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా, రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. రిటైర్డ్ అయిన సందర్భంలో నామినల్ మొత్తం ఇవ్వడం వల్ల ఒంటరి మహిళలు, కుటుంబ ఆదరణ లేని వాళ్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 48 ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్వాడీలు సర్వీసులో చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయడం లేదని చెప్పారు. సమస్యలపై అంగన్వాడీలు దశల వారీగా అనేక ఆందోళనలు చేపట్టారని, అధికారులతో చర్చలు జరిగినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీంతో డిసెంబరు ఎనిమిదో తేదీ నుంచి సెంటర్లని మూసివేసి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలకు పెంచాలని, పెన్షన్ ఇవ్వాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు. రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు పి.లక్ష్మి, నిర్మల, లక్ష్మి, జలజాక్షి, ఎస్.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు మెడికవర్‌లో 'ఆరోగ్య భద్రత'

ఎస్‌పి జి.ఆర్ రాధిక



ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలోని మెడికవర్ హాస్పిటల్‌లో పోలీసులకు ఆరోగ్య భద్రత పథకం అందుబాటులోకి వచ్చిందని ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. దీని ద్వారా పోలీసు సిబ్బందికి నగదు రహిత వైద్య సేవలు అందించనున్నారని చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ఎస్‌పి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్‌లో మేజర్ చికిత్సలన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఇతర జిల్లాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన అవసరం ఇకపై ఉండదన్నారు. నేత్ర వైద్యం, కేన్సర్, ప్లాస్టిక్ సర్జరీ, బర్న్స్ వంటివి మినహా మిగతా అన్నిరకాల వైద్య సదుపాయాలు అందిస్తారని వివరించారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబసభ్యులు ఆరోగ్యంపై దృష్టిసారించాలని, నిత్యం వ్యాయామంతో పాటు మూడు నెలల వ్యవధిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈనెల ఒకటో తేదీ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిరోజూ ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఇద్దరు చొప్పున 50 మందికి వైద్య పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటే మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తారని చెప్పారు. వైద్య పరీక్షల్లోనూ అక్కడ 30 శాతం రాయితీ ఇస్తారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఎటువంటి అలసత్వం లేకుండా తక్షణమే వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. మెడికవర్ హాస్పిటల్ హెడ్ డాక్టర్ శ్రీధర్ పోలీస్ సిబ్బందికి అన్నివిధాలుగా సహాయపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అనిరుధ్, సాగరిక, కోటేశ్వరరావు, మూర్తి, పోలీస్ యూనిట్ డాక్టర్ సిహెచ్.విజయ్ కుమార్, ఎఒ సిహెచ్.గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

మా గ్రామాలకు రోడ్డు వేయండి

స్పీకర్ తమ్మినేనికి గిరిజనులు మొర

ప్రజాశక్తి - బూర్జ

తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని మండలంలోని తిమడాం, జంగాలపాడు, మసానపుట్టి, జె.వి పురం, అడ్డురిపేట, బొడ్లపాడు గ్రామాల గిరిజనులు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. ఈ గిరిజన గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను స్పీకర్ వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రోడ్డు లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. రహదారి సౌకర్యం లేక అత్యవసర పరిస్థితుల్లో వైద్యానికి వెళ్లేందుకూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. కనీసం ఆటోలు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ ఈ నెలాఖరులోగా రోడ్డు పనులను ప్రారంభిస్తామని హామీనిచ్చారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు, ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి కె.కృష్ణంనాయుడు, బి.సూర్యారావు, వైసిపి మండల అధ్యక్షులు కె.గోవిందరావు, మండల సచివాలయాల కోఆర్డినేటర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


బూర్జ : పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

10న చంద్రబాబు రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



తెలుగుదేశం పార్టీ జాతీయాధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఈనెల పదో తేదీన జిల్లాకు రానున్నట్లు తెలిసింది. పంచాయతీలకు నిధులు, సర్పంచ్‌ల హక్కులపై శ్రీకాకుళం నగరంలో నిర్వహించనున్న ఉత్తరాంధ్ర స్థాయి అవగాహనా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనున్నట్లు సమాచారం. చంద్రబాబు పర్యటనకు సంబంధించి పార్టీకి చెందిన ముఖ్య నేతలు ఈ అంశాన్ని సూచనప్రాయంగా తెలిపారు.



పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కలమట

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం పద్ద, ఆంజనేయపురం, సానిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి పంటకు వచ్చే దశలో నీరు లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చిందని, రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాలు లేక పంటలు పోవడంతో రైతాంగం ఆరుగాలం కష్టపడి పండించే పంట ఇంటికి రాకుండా పశువులు మేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట పోయిన రైతుకు ఎకరాకు రూ.20 వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్ గౌడ్, లలిత కుమారి, పడాల శ్రీను, వసంత్, భాస్కరరావు, గణపతిరావు, పరమేశ్వర్ రెడ్డి, దుక్క బాలరాజు, రైతులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు, సాయిరాజ్

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

రాష్ట్రంలో అన్ని పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్టు ఎమ్మెల్సీ రామారావు, నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ తెలిపారు. మండలం లండారిపుట్టుగ పంచాయతీ కొత్తపుట్టుగ గ్రామంలో జెడ్‌పి నిధులు రూ.15 లక్షలతో సిసిరోడ్డు నిర్మాణానికి గురువారం శంఖుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాలు బాగున్నప్పుడే పట్టణాలు బాగుంటాయని, దాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పంచాయతీలో ప్రతిగ్రామం అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, నర్తు శివాజీ, మురపాల లచ్చయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

గోకర్ణపల్లిలో వై నీడ్ ఎపి జగన్

ప్రజాశక్తి- పొందూరు

మండలం గోకర్ణపల్లిలో వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ అధ్యక్షతన గురువారం వై నీడ్ ఎపి జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ లబ్ధిదారులకు అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఇఒపిఆర్‌డి సింహాచలం, ఎమ్‌ఎల్‌ఒ మోహనరావు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న రాజేష్

ఘనంగా ఎల్.ఎన్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి- కవిటి

ప్రముఖ పారిశ్రామికవేత్త కీ.శే లోళ్ల నారాయణమూర్తి జయంతి వేడుకలు స్థానిక కల్యాణి ఆంగ్ల పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకుడు, నారాయణమూర్తి కుమారుడు లోళ్ల రాజేష్ ఎల్ఎన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నారాయణమూర్తి ఉదారభావాలు కొన్ని వందల కుటుంబాలకు ఆశ్రయం కల్పించాయని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందుమాధవి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ లత, బి.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చెరువు ఆక్రమణపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

చెరువు ఆక్రమణలపై ఆందోళన

ఇచ్ఛాపురం : పట్టణంలో బెల్లుపడా వద్ద ఉన్న కోటేరు బంద చెరువు ఆక్రమణలపై సమగ్ర సర్వే జరిపి పూర్తి విస్తీర్ణం అప్పగించాలని గ్రామపెద్దలు, రైతులు మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌కి స్పష్టం చేశారు. కోటేరు బంద 35 ఎకరాలు విస్తీర్ణం కలిగిన చెరువు ఆక్రమణలతో కేవలం 23ఎకరాలకే పరిమితం కావడం దారుణమన్నారు. సుమారు 18 వందల ఎకరాలు పంటలకు కష్ట కాలంలో ఈ చెరువు ఉపయోగ పడుతుందని, చెరువు ఆక్రమణ జరిగితే రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి ఆక్రమణలు తొలగించాలని వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా సర్వేచేసి చేతులు ఎత్తేయడం శోచనీయమన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఆశీ చిరంజీవులు రెడ్డి, దొరబాబు రెడ్డి, తులసీ దాస్ రెడ్డి, కుర్మారావు రెడ్డి, కొండ శంకర్ రెడ్డి, నీలపు ఢిల్లీ, త్రినాథ్, గుజ్జు గోపాల్, రాజు ఉన్నారు.

స్వదేశీ మత్స్యకారులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి- నౌపడ

స్వదేశీ మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని సంతబొమ్మాలి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి అన్నారు. స్వదేశీ మత్స్యకార సహకార సంఘం పరిధిలో గల చెరువుల్లో చేపలు పెంపకం చేస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం అందజేస్తున్న 40 శాతం రాయితీపై 11వేల చేప పిల్లలను గురువారం పంపిణీ చేశారు. ఫింగర్లింగ్స్ (80-100 ఎమ్ఎమ్) సైజు గల చేప పిల్లలను నాయకుల సమక్షంలో సంతబొమ్మాలి, వడ్డితాండ్ర, కోటపాడు గ్రామాల్లోని చేపల చెరువుల్లో విడిచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు హన్నారావు, భాస్కరరావు, వాసు, మిట్టి నారాయణ, చినబాబు, కృష్ణ పాల్గొన్నారు.



చెరువులో చేప పిల్లలను వదులుతున్న వసంత రెడ్డి

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



వజ్రపుకొత్తూరు : పోస్టర్లను పంపిణీ చేస్తున్న శిరీష

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుపై ఆధారపడి ఉందని పలాస ఇన్‌ఛార్జి గౌతు శిరీష అన్నారు. గురువారం గునిపల్లి గ్రామ పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని లబ్ధిదారులకు టిడిపి గ్యారంటీ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సురాడ మోహనరావు, మాజీ ఎంపిటిసి జెజెరావు, కొడ రామన్న, లైశెట్టి భీమారావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, దుర్గారావు, సాతుపల్లి కామేసు, మహిళలు పాల్గొన్నారు.

ఆమదాలవలస : చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మైనారిటీ నాయకుడు మాలిక్ అన్నారు. గురువారం పురపాలక సంఘ పరిధిలోని 11వవార్డు మెట్టక్కివలసలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతున్నదని, మైనార్టీ, బీసీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఇంటింటికి వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మొయ్యి రమణ, బరాటం వైకుంఠం, ఎరిపిన గోపి పాల్గొన్నారు.

పురపాలక సంఘం పరిధి కృష్ణానగర్, గాంధీనగర్, గొల్లవీధి ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బోర గోవిందరావు, యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్ల మురళి యాదవ్, షేక్ మాలిక్, రమణ, గోపి, చిరంజీవి పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని చిగురు వలస పంచాయతీ పరిధిలోని బకిరిపేటలో మండల టిడిపి నాయకుడు కొర్ను సూర్యనారాయణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ గొండెల తిరుపతిరావు, గొండెల రామారావు పాల్గొన్నారు.



ఆమదాలవలస : పోస్టర్లను పంపిణీ చేస్తున్న గోవిందరావు, మురళీధర్

టెక్కలి: మండలంలో నర్సింగపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు బగాది శేషగిరి, మండల పార్టీ నాయకులు హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, మహిళా అధ్యక్షురాలు మెండ దమయంతి, పోలాకి షణ్ముకరావు, పోలాకి చంద్రశేఖర్, కోళ్ల లవకుమార్, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్ చంద్, కొళ్ళ కామేష్, సోడిమూడి కిరణ్‌కుమార్, జీరు వెంకటరెడ్డి, గండి చంద్రరావు పాల్గొన్నారు.

వాడివేడిగా మున్సిపల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

కెటి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న తారురోడ్డు నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని వైసిపి కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ ఆరోపిస్తూ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకు డిసెంట్ సమర్పించడంతో మున్సిపల్ సమావేశం వాడివేడిగా సాగింది. మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ డిసెంట్ ఇవ్వడం కౌన్సిలర్‌గా నాహక్కుని, డిసెంట్ అందజేసిన తర్వాత సమావేశంలో మాట్లాడనవసరం లేదన్నారు. కాశీబుగ్గ కెటిరోడ్ నిర్మాణం 002 అకౌంట్ నిధులు వినియోగించేందుకు, సింగల్ టెండర్‌పై కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించేందుకు కౌన్సిల్ ఆమోదం కోసం అజెండాలో పెట్టడంతో తాను డిసెంట్ పెట్టాల్సి వచ్చిందన్నారు. దీనిపై వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర బుజ్జి, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, దుర్గాశంకర్ పండా, పప్పల ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ మాట్లాడుతూ 002 అసెంట్ నిధులు అభివృద్ధి పనులకు వినియోగించకూడదనే నిబంధన ఎక్కడా లేదని, 40 శాతం నిధులు మున్సిపాలిటీ ఖర్చుల మేరకు ఖాతాలో ఉంచుకొని 60శాతం నిధులు అభివృద్ధి ఖర్చుచేసుకోవచ్చని మున్సిపల్ యాక్ట్‌లో ఉందన్నారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు వజ్జ బాబూరావు, తంగుడు ఆశాలత మాట్లాడుతూ అభివృద్ధికి తాము అడ్డంకికాదని, సింగల్ టెండర్ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించే ముందు కౌన్సిల్ అనుమతి తీసుకోవాలని, 002 అకౌంట్ నిధులు అభివృద్ధికి ఎలా వినియోగిస్తారని ప్రశ్నించారు. కౌన్సిలర్ శ్రీకాంత్, వజ్జ బాబూరావులు మాట్లాడుతూ నెహ్రుపార్కుకు గతంలో నిధులు వెచ్చించినా ఎటువంటి అభివృద్ధి జరగలేదని, ఇప్పుడు మరో పది లక్షలు నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. పూర్తిస్థాయిలో పార్క్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో కమీషనర్ టి.నాగేంద్రకుమార్, మున్సిపల్ ఎఇ అవినాష్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బలగలో అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బలగలో నాగేశ్వర ఆలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, ప్రముఖ వ్యాపారవేత్త రెడ్డి శివన్నారాయణ, టిడిపి నాయకులు చిట్టి రాము, చిట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ఆడుదాం ఆంధ్రాలో 15 ఏళ్లు దాటిన యువతి, యువకులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని ఎంపిడిఒ మురళీమోహన్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పాలవలస గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్ తదితర క్రీడల్లో యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా తనిఖీ

ప్రజాశక్తి- కవిటి

ఓటర్ల జాబితాను తనిఖీ పక్కాగా అమలు చేయాలని తహశీల్దార్ పి.శేఖర్ సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలు, అధికారులతో గురువారం సమీక్షించారు. నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తులకు సంబంధించిన ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు, మూడు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచేయాలని సూచించారు. డిగ్రీ చదువుతున్న 18 ఏళ్లు దాటిన యువతీ, యువకులకు పక్కాగా ఓటుహక్కు కలిగివుండేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డిటి రామచంద్రరావు, ఆర్ఐ రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిఎం జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని సీడ్ ఎపి చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలో శాసనం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి బోధన తీరుతెన్నులు, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పిల్లలతో కలిసి చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులు పరిశీలించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు గురువారం ఘనంగ సత్కరించి అభినందిచారు. సీఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్ క్రీడాకారులను అభినందించి సీఐ మాట్లాడుతూ తాను నేషనల్ అడానని, స్పోర్ట్స్‌కు చాలా విలువ ఉందని, రైల్వే, బిఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్ వంటి ఉద్యోగాల్లో రెండు శాతం ఉద్యోగాలు కోటా ఉంటుందన్నారు. 33వ అంతర్ జిల్లాల ఖోఖో టోర్నమెంట్ నరసరావుపేట పల్నాడు జిల్లాలో జెడ్‌పిహెచ్ స్కూల్ శంకరాభారతిలో జరిగాయి. అందులో శ్రీకాకుళం గర్ల్స్ టీం విన్నర్స్‌గా నిలిచారు. ముగ్గురు విద్యార్థులను నేషనల్ ఇవ్వడం జరిగింది. గొర్రెల భవాని, సాడి తేజశ్రీ, సరస్వతిలను సీడ్ ఏపి చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్ బచ్చు జగన్, గగన కుమారి, జిల్లా ఖోఖో కార్యదర్శి చిట్టి, కోచ్ సత్యనారాయణ, పిఇటి అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణయ్య, బత్తిన నాగరాజు, ఎండి వజీర్, ధర్మరాజు, రమేష్, బి. వెంకట రమణ పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

కొత్తూరు : జాతీయ బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు లేబర్ సహాయ అధికారి వి.జయశంకర్ ఆధ్వర్యంలో మండలంతో పాటు హిరమండలంలో బట్టల దుకాణాలు, స్వీట్ బేకరీల్లో 18 సంత్సరాలు లోపు ఉన్నవారిని మండల కేంద్రంలో గోపాల్ రడీమేడ్ బట్టలు షాపులో ఒకరిని, వెంకటేశ్వర బెంగుళూరు బేకరీలో ఒకరిని గుర్తించి అపరాధ రుసుం విధించారు. కొన్ని షాపుల్లో వ్యత్యాసాలు ఉండడంతో రూ.10వేలు డిడిని తీయించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది సిహెచ్ సత్యనారాయణ, వరదాచారి ఉన్నారు.


పశువులు పట్టివేత

కొత్తూరు: స్థానిక నాలుగురోడ్లు కూడలి వద్ద గురువారం వాహనాల తనిఖీల్లో భాగంగా ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ తనిఖీ చేయగా అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న పశువులను పట్టుకొని కేసు నమోదు చేసి పశువులను బారువ పశువుల కేంద్రానికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ స్టాండింగ్ వకీలు నియామకానికి చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపల్ స్టాండింగ్ వకీలు నియామకానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ ఛైర్పర్సన్ లాభాల స్వర్ణమణి సూచించారు. గురువారం ఛైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సెల్ సాధారణ సమావేశం జరిగింది. స్టాండింగ్ వకీలు నియామకానికి తీసుకుంటున్న చర్యలపై వైస్ చైర్మపర్సన్ స్వర్ణమణి మున్సిపల్ కమిషనర్ రమేష్‌ని ప్రశ్నించారు. స్థానిక బార్ అసోసియేషన్‌కి లేఖ పెట్టినప్పటికీ ఎవరు దరఖాస్తు చేయలేదన్నారు. మరోసారి లేఖపెట్టడం జరుగుతుందన్నారు. ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్‌లో ఎవరు ముందుకు రాకపోతే సోంపేట బార్ అసోసియేషన్‌కి లేఖ పంపించాలని సూచించారు. పాత స్టాండింగ్ వకీలు నియామకం పొడిగించలేదని వేంటనే కొత్త నియామకానికి చర్యలు తీసుకోవాలన్నారు. తమ వార్డులో మంచినీరు సక్రమంగా రావడం లేదని చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ లీలారాణి కోరారు. సయ్యద్ ఖాన్ చెరువు వద్ద అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కౌన్సిలర్ ప్రదీప్ సబ్ దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్ రమేష్ స్పందిస్తూ చెప్పిన వినకపోతే కూల్చడం తప్పదన్నారు. సమావేశంలో మున్సిపల్ కో- ఆప్షన్ సభ్యులు సయ్యదా సుల్తాన్, వార్డ్ కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

గాయత్రి కళాశాలలో ట్రేడ్‌ఫెయిర్

ప్రజాశక్తి-శ్రీకాకుళం రూరల్

మండలంలోని మునసబుపేటలో గల గురజాడ విద్యాసంస్థల్లోని గాయత్రి కళాశాలలో ట్రేడ్ ఫెయిర్‌ను గురువారం నిర్వహించారు. విద్యార్థులు వినూత్నమైన వస్తువులు గృహ ఉపకరణాలు ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఆర్గానిక్ ఉత్పత్తులు వివిధ స్టార్టప్ కంపెనీల వస్తువులు ఆటోమొబైల్ రంగం నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలు, ఒకయా ఎలక్ట్రిక్ వాహనాలు ప్రదర్శన నిర్వహించారు. గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి స్వామినాయుడు, కరస్పాండెంట్ రంగారావు ప్రదర్శనను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రేడ్ ఫెయిర్ పర్యవేక్షకులు, టెక్నిక్ మేనేజింగ్ డైరెక్టర్ కె.ప్రసాదరావు, గురజాడ సంస్థల అధినేత జి.వి స్వామినాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం గల అంశాలను ప్రయోగాత్మకంగా నేర్చుకోవడం ట్రేడ్ ఫెయిర్ లక్ష్యమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు స్కాలర్స్ బజార్ రూపకర్త విభాగాధిపతి వంగ మహేష్‌ను అభినందించారు.



ట్రేడ్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న స్వామినాయుడు

సమాజ హితం కోసమే 'మానవత'



రథం, ఫ్రీజర్ బాక్సులను అందజేస్తున్న రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కష్టంలో ఉన్న వారికి అండగా నిలబడాలన్న లక్ష్యంగా మానవత సంస్థ పనిచేస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. సంస్థ జిల్లా చైర్మన్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి అధ్యక్షతన నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ భవనం వద్ద గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నగరంలో ప్రజల అంతిమ సంస్కారాలకు అవసరమైన శాంతి రథం, రెండు ఫ్రీజర్ బాక్సులను ఆయన జిల్లా విభాగానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది సభ్యులతో అన్ని జిల్లాల్లోనూ మానవత సంస్థ సేవలందిస్తోందన్నారు. జిల్లాలోనూ మానవతావాదులు, సమాజ హితులు సమన్వయం చేసుకుంటూ సంస్థను ముందుకు తీసుకెళ్లి ఆపదలో ఉన్న ప్రజలకు సేవలందించాలన్నారు. సెంట్రల్ కమిటీ డైరెక్టర్ శ్రీరామాంజనేయరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సేవలో జిల్లాకు చెందిన పలురంగాల ప్రముఖులు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. శాంతిరథాన్ని హైదరాబాద్‌కు చెందిన షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సంస్థ వితరణ అందించగా, దాన్ని మెరుగులు దిద్దేందుకు జిల్లాకు చెందిన బరాటం శ్రీరామ్మూర్తి, బరాటం లక్ష్మణరావు, బరాటం విశ్వేశ్వరరావు రూ.లక్ష విరాళం అందించారు. ఈ సందర్భంగా దాతలను సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి సత్కరించారు. సంస్థ రాష్ట్ర ప్రతినిధులు రాధాపుష్పవతి, జానకి రామరాజు, సంస్థ జిల్లా కన్వీనర్ దొంతం పార్వతీశం, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ రజనీకాంతరావు, వివిధ రంగాల ప్రముఖులు పి. జగన్మోహనరావు, సురంగి మోహనరావు, నటుకుల మోహన్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మృతికి కారణమైన వ్యక్తి ఇంటి వద్ద ధర్నా
నిలిచిపోయిన ట్రాఫిక్



ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు

ప్రజాశక్తి- జి.సిగడాం

దవళపేట, సంతవురిటి గ్రామ మధ్యలో రోడ్డు ప్రమాదంలో రైతు కూలీ ఆబోతులు పైడమ్మ(52) శ్రీకాకుళం రిమ్స్‌లో వైద్యం పొందుతూ మతి చెందాది. ఆబోతులుపేట గ్రామానికి చెందిన ఈమె భర్త సిమ్మన్న, కుమారులు శ్రీనివాసరావు, సాయి, కుమార్తె లక్ష్మి దవలపేట గ్రామంలో వరిచేను కోతకు వెళ్లి వస్తుండగా రాజాం నుంచి పొందూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనం పైడమ్మను ఢీ కొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే పడిపోయిన బాధితురాలని అంబులెన్స్ ద్వారా శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గురువారం ఎస్ఐ ఛామంతుల రామారావు కేసు నమోదు చేయగా వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. వాంగ్రంగి జంక్షన్‌కు చెందిన ద్విచక్ర వాహనదారుడు బి.నారాయణరావు స్పందించకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు పైడమ్మ మృతదేహంతో నారాయణరావు ఇంటి వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6:45 వరకు ధర్నా చేపట్టారు. సిఐ ఎస్.ఆదమ్ 4 గంటల సమయంలో వచ్చి నచ్చచెప్పినా వినకుండా ధర్నా కొనసాగించారు. బాధ్యులను తీసుకువస్తే ధర్నా విరమిస్తామని నినాదాలు చేశారు. చివరికి స్పెషల్ ఫోర్స్ రావడంతో సద్దుమణిగి ధర్నాను విరమించారు. దీంతో సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితులతో మాట్లాడుతున్న సిఐ ఆదాం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- టెక్కలి

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. సంఘ గౌరవాధ్యక్షులుగా చింతాడ అనిరుద్రుడు, అధ్యక్షులుగా నౌపడా సింహచలం, ఉపాధ్యక్షులుగా ఎం.చంద్రశేఖరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.భవానీ, కోశాధికారిగా ఎన్.చంద్రరావులతో పాటు ముఖ్యకార్యవర్గ సభ్యులుగా ఎన్.రామారావు, బి.రాజశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ప్రధాన ఎన్నికల ఆధికారిగా ముద్దాడ రామ్మోహనరావు, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు మెట్ట జనార్దనరావులు హాజరయ్యారు. సమావేశంలో మామిడి సత్యన్నారాయణ, జోన్ అధ్యక్షులు ఐ.గణపతిరావుతో పాటు నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఇఒ-2 కె.చిన్నారావు అన్నారు. గురువారం మండలంలో సీతాపురం జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల సముదాయాలు బోధన నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరు సుస్థిరాభివృద్ధి కోసం 100శాతం విద్యార్థులను బడిలో చేర్పించే, నూతన విద్యా విధానాలపై ఉపాధ్యాయులు తెలుసుకోవాలని సూచించారు. సముదాయంలో హాజరైన ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను ఒకరితో ఒకరు పంచుకొని విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ వైకుంఠరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుకుమారి, సముదాయ రిసోర్స్‌పర్సన్ తమ్మినేని వైకుంఠరావు, నందిగాం, టెక్కలి మండలాల యుపి ఉన్నత పాఠశాల హిందీ సహాయకులు హాజరయ్యారు.

మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సిఎం జగన్మోహన్‌రెడ్డి మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా ప్రాధాన్యత ఇస్తున్నారని టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. గురువారం టెక్కలిలో మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజనమ్మ, సర్పంచ్ గొండెలి సుజాత, తహశీల్దార్ ప్రవల్లిక, ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి, మత్స్యశాఖ అధికారులు, వైసిపి నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ సోంపేట శాఖ నూతన కార్యవర్గ సభ్యులు

వేడుకలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- సోంపేట

యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను ఉపాధ్యాయులంతా విజయవంతం చేయాలని సంఘ జిల్లా సహాధ్యక్షుడు లండ బాబురావు కోరారు. గురువారం సోంపేటలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం స్థాపించి 49 ఏళ్లు పూర్తయి స్వర్ణోత్సవంలోకి అడుగు పెడుతున్నామన్నారు. కోటబొమ్మాలిలో జరిగే స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సోంపేట మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరావు, అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్.కూర్మారావు, జి.దొరబాబు, సహాధ్యక్షులుగా రమేష్, స్వాతి, కోశాధికారిగా శాంతి కుమారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మురళి, కాళిదాసు, ప్రకాష్, మన్మధరావు, రవి పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా పోలీస్‌గా భార్గవి

ప్రజాశక్తి- పొందూరు

జిల్లా ఉత్తమ సచివాలయ మహిళా పోలీస్‌గా మండలం బురిడి కంచరాం సచివాలయానికి చెందిన ఎస్.భార్గవికి జిల్లా ఎస్‌పి జి.రాధిక ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. తన విధుల్లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు తెలిపారు. ఈమెకు స్థానిక పోలీస్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు అభినందనలు తెలిపారు.



కన్నా మాస్టార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

సేవలతోనే సమాజంలో గుర్తింపు

కంచిలి: విధి నిర్వహణలో ఉద్యోగి చేసే నిస్వార్థమైన సేవలే ప్రజల్లో మంచి గుర్తింపునిస్తాయని ఎంఇఒ ఎస్.శివరాం ప్రసాద్ అన్నారు. తలతంపర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ గురువారం ఉద్యోగ విరమణ పొందిన జిఎస్ఎస్ ప్రసాద్ (కన్నా)ను ఎంఇఒ సమక్షంలో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ 98 బ్యాచ్ ద్వారా ఉద్యోగం పొంది నిబంధనల మేరకు పదవి విరమణ పొందుతున్న కన్నా మాస్టారు అతి తక్కువ కాలంలోనే మంచి ఉపాధ్యాయుడుగా పేరు సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఇఇ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ, పలాస పట్టణాలతో పాటు సూదికొండ, అన్నపూర్ణ ఆశ్రమం, టోల్‌గేట్, మొగిలిపాడు, శాసనం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



సోంపేట : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి దాసు

సోంపేట: మండలంలోని గొల్లగండిలో గురువారం ఎంపిపి నిమ్మన దాసు ఆధ్వర్యంలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా మరల జగన్మోహన్ రెడ్డిని ఆదరించాలని కోరారు. అంతకుముందు పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పనులకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ప్రతినిధి తడక జోగారావు, నాయకులు ఎస్.భాస్కరరావు, ఎం.ఈశ్వరరావు, వై.మన్మధరావు, జి.దండాసి, వెంకటరావు, షణ్ముఖరావు, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం హరిశ్చంద్రపురం సచివాలయం నందు వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైసిపి జెండాను ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజుతో కలిసి ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపిటిసిలు పూజారి సత్యం, బగాది దివాకర్, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతి రావు హేమసుందరరాజు, జెసిఎస్ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, నాయకులు పేడాడ వెంకటరావు, కవిటి రామరాజు, సంపతిరావు వెంకట రమణ, సింగుపురం వినోద్, ఇఒపిఆర్‌డి రామారావు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



రణస్థలం : సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

రణస్థలం: మండలంలో బంటుపల్లి గ్రామ సచివాలయం పరిధిలో "మా నమ్మకం నువ్వే జగన్, ఆంధ్రప్రదేశ్ కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ పాల్గొన్నారు. అనంతరం వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఎఒ ధనుంజయరావు, అధికారులు శ్రీనివాస్ నాయుడు, బోనెల లావణ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశావహ దృక్పథమే విజయ సోపానం

ప్రజాశక్తి- నరసన్నపేట

ఆశావాద దృక్పథంతో ముందుకు సాగితే విజయం తథ్యమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, రంగస్థల నటుడు టేకి హరిప్రసాద్ తెలిపారు. గురువారం పద్మావతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ మీ మనస్సుకు మీరే యజమాని, మీ జీవితానికి మీరే దిశ, నిర్దేశకులు అంటూ చేసిన ప్రసంగం విద్యార్థులను ఆకట్టుకుంది. చదువు పూర్తవ్వడమే జీవితానికి పరమార్థం కాదని, జీవితానికి ఆరంభం అని, సమాజంలో ఏ విధంగా మెలగాలో జీవితం నేర్పుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీలు నిర్వీర్యం

ప్రజాశక్తి- రణస్థలం

వైసిపి ప్రభుత్వం ఏర్పాటు తరువాత గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. రణస్థలంలో సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు మాట్లాడుతూ నాలుగేళ్లలో 12, 918 గ్రామ పంచాయతీల 14, 15 ఆర్థిక సంఘంలో విడుదలైన నిధులు ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. సమావేశంలో నియోజకవర్గంలో పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఐవైఎఫ్ నాయకులు

జాబ్ కేలండర్ ఎక్కడ..?

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో ఖాళీగా 25 వేల ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్‌సి ప్రకటిస్తానని ఎన్నికల ముందు చెప్పి నాలుగున్నర ఏళ్లుగా ఒక్క ఉపాధ్యాయ ఉద్యోగం కూడ ఇవ్వకుండా విద్యార్థులను, నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేశారని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాసుదేవరావు, కొన్న శ్రీనివాసరావు అన్నారు. గురువారం పలాసలో విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయ ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేక అరకొర పాఠాలు చెబుతున్నారని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం అంటే ఇదేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు కె.జానకిరామ్, సంతోష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలో నౌపడ రైల్వే గేటు వద్ద గురువారం జరిగిన ట్రాక్ మరామ్మతు పనులతో టెక్కలి, నౌపడ, పూండీ రహదారిపై ట్రాఫిక్ పలుమార్లు స్తంభించింది. నౌపడ రైల్వే జంక్షన్ వద్ద మెయిన్ ట్రాక్ మరామ్మతులకు గురవ్వడంతో రైల్వే సిబ్బంది పనులు చేపట్టారు. దీంతో ఈమార్గం మీదుగా ప్రయాణించే వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరిగేందుకు అనుకూలంగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కళాశాల ప్రారంభం, విడిచిపెట్టిన సమయాల్లో విద్యార్థులు సమయానికి చేరుకోవడానికి పలు అవస్థలు పడ్డారు. సాయంత్రానికి ట్రాక్ పనులు మరమ్మతులు పూర్తికావడంతో యధావిధిగా రాకపోకలు సాగాయి.

ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పలాస

గుంటూరు జిల్లా కెఎల్ విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యం కోసం సామాజిక సాంస్కృతిక పద్ధతులు అనే విభాగంలో ప్రదర్శించిన ప్రాజెక్టు ప్రథమ స్థానం పొంది జాతీయ స్థాయి పోటీలకు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంపికైంది. ప్రస్తుత పారిశ్రామికీకరణ యుగంలో కర్మాగారాలు నుంచి వెలువడే విష రసాయనాలలో మానవులు, జంతువుల మనుగడకు ఎంతో హాని కలిగిస్తున్నాయి. నీటిని శుద్ధికి చేపట్టిన ప్రాజెక్టును పలాస ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు డి యుగంధర్, డి. రాకేష్, గైడ్ ఉపాధ్యాయులు షణ్ముఖరావులు తయారు చేసిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొంది జాతీయ స్థాయికు ఎంపికైంది. జాతీయ స్థాయికు ఎంపిక పట్ల వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి దాసరథి అభినందనలు తెలిపారు.

అందరికీ ఓటు హక్కు కల్పించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

18 సంవత్సరాలు నిండిన వారందరిని గుర్తించి వారికి ఓటుహక్కు కల్పించాలని పాతపట్నం నియోజవర్గ ఎన్నికల అధికారి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీ పక్కాగా ఉండాలన్నారు. గ్రామాల్లో బోగస్ ఓట్లను తొలగించాలన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగినట్లయితే దానికి బిఎల్‌ఒలు బాధ్యత వహించాల్సి ఉంటుదన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు బిఎల్‌ఒలు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, డిటి శంకరరావు, ఇఒ తిరుపతి పట్నాయక్, ఆర్ఐ వైకుంఠరావు, అన్నాజీరావు, హిమగిరి, రమణ, బిఎల్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని యూనియన్ బ్యాంకు మేనేజరు బి.శ్రీనివాస్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో 'కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యాన బి సైబర్ స్మార్ట్ పేరుతో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ చెప్పకూడదన్నారు. ఇండియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ ఫోన్లలో కెవైసిను అప్‌డేట్ చేయాలని ఫోన్లకు వచ్చే మెసేజ్‌లను క్లిక్ చేయొద్దన్నారు. అందులో ఒటిపితో సహా వివరాలు చెప్పడంతో మోసపోతారని హెచ్చరించారు. దిశ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బి.రేవతి సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టడం వల్ల వస్తున్న సమస్యలను వివరించారు. ఎవరికీ చెప్పుకోలేని సమస్యలు ఎదురైతే దిశ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదిస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. సైబర్ సెల్ ఎస్ఐ సిహెచ్.ప్రసాద్ సోషల్ మీడియా ఖాతాల్లో జరిగే మోసాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగ అధ్యాపకులు ఐ.శ్రీలక్ష్మి, ఎస్.మాధవీలత, ఎస్.వాణికుమారి, జి.సుమలత, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్

వైద్య శిబిరానికి స్పందన



శిబిరాన్ని పరిశీలిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేటలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విశాఖపట్నం మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన క్యాన్సర్‌వ్యాధి నిర్ధారణ శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో పలువురు రోగులు చికిత్స చేయించుకుని వైద్యుల సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో లైయన్స్‌క్లబ్ అధ్యక్షులు సదాశివుని కృష్ణ, కార్యదర్శి వారణాసి నాగరాజు, ట్రెజరర్ పొట్నూరు రమేష్. ప్రతినిధులు రమణ సాహు, చీపురు కృష్ణమూర్తి, పొన్నాన దాలినాయుడు, బాలగంగాధర్, సోమేశ్వరరావు, బాలకృష్ణ, మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు భార్గవ్, సౌజన్య, సురేష్ పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్‌కు ట్రిపుల్ ఐటి విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ట్రిపుల్ ఐటి డైరెక్టర్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

అండర్-19 స్కూల్ ఆఫ్ జనరల్ ఫెడరేషన్‌కు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు విజయవాడలో నిర్వహించే టోర్నమెంట్‌లో విద్యార్థులు పాల్గొనున్నారు. ఎంపికైన విద్యార్థులు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వెంకటగోపాల ధన బాలాజీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించి జాతీయస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రతినిధులు కృష్ణరాజు, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ ఫణీంద్రకుమార్ అన్నారు. గురువారం మండలంలో లఖందిడ్డి, సౌడాం పంచాయతీలో నరేంద్రమోదీ పిలుపు మేరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోందని, వీటిపై గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడంతో లబ్ధి చేకూరడం లేదన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించిన 2024 కేలండర్‌ను అవిష్కరించారు. అంతకు ముందు ఎంపిడిఒ లఖందిడ్డిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు, సర్పంచ్ బమ్మిడి గణపతిరావు, మండల ప్రత్యేకాధికారి మంద లోకనాధం, ఇఒపిఆర్‌డి రామారావు, నాయకులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

నీరు విడుదల చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

నియోజకవర్గం పరిధిలోని తోటపల్లి రిజర్వాయర్ ఆయకట్టు భూములకు రైతులు పంటలు సాగు చేసేందుకు అవసరమైన సాగునీరు సరఫరా చేయలేకపోయారని, కనీసం పశువుల దాహార్తిని తీర్చడానికైనా తోటపల్లి రిజర్వాయర్ పంట కాలువ ద్వారా నీరు విడుదల చేయాలని టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు ఇరిగేషన్ శాఖ అధికారులను అభ్యర్థించారు. గురువారం టిడిపి నాయకులు, రైతులతో కలిసి రాజాంలో గల తోటపల్లి రిజర్వాయర్ కార్యాలయంలో అధికారులను అప్పలనాయుడు సంప్రదించారు. కార్యాలయంలో సంబంధిత డిఇ, ఎఇ అందుబాటులో లేకపోవడంతో ఇదే విషయంపై వారితో ఫోన్లో సంప్రదించి మాట్లాడారు. పంటలు పండక పోవడం వలన రైతులు వద్ద పశుగ్రాసం కొరత ఏర్పడిందని, ప్రస్తుతం తోటపల్లి రిజర్వాయర్ నీటితో చెరువులను నింపగలిగినట్టయితే పశువుల దాహార్తిని తీర్చడానికి సాధ్యపడుతుందని పేర్కొన్నారు.